చికెన్ ధరలు	
లైవ్	135
డ్రెస్	200
స్కిన్‌లెస్	230
గుడ్డు డజన్	68

ఉష్ణోగ్రత	
గరిష్ఠం	34.0
కనిష్ఠం	23.4

సీహెచ్‌సీలో రోగులపట్ల

వైద్యుల నిర్లక్ష్యం తగదు



● మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

7

వన మహోత్సవం షురూ



భువనగిరి శివారులో నర్సరీలో పెరుగుతున్న మొక్కలు

» లక్ష్యం 20.90 లక్షలు

» వర్షాలు కురుస్తుండటంతో పలుచోట్ల మొక్కలు నాటుతున్న సిబ్బంది

» నర్సరీల్లో పంపిణీకి మొక్కలు సిద్ధం

వానాకాలం ఆరంభమైంది. ఓ మోస్తారుతోపాటు చిరుజల్లులతో కూడిన వానలు కురుస్తున్నాయి. దీంతో వన మహోత్సవం కార్యక్రమం కింద మొక్కలునాటే కార్యక్రమాన్ని జిల్లాయంత్రాంగం ప్రారంభించింది. జిల్లాలో ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఆయా శాఖల అధికారులు మొక్కలు నాటుతున్నారు. అటవీ శాతాన్ని పెంచాలన్న ధృడ సంకల్పంతో ప్రభుత్వం ముందుకు పోతోంది. జిల్లాకు నిర్దేశించిన మేరకు పకడ్బందీగా మొక్కలు నాటాలని ఇటీవల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు జారీచేశారు. దీంతో ఈ వారం రోజుల్లో మొక్కలు నాటే కార్యక్రమం ఊపందుకోనుంది. జిల్లాలోని శాఖలవారీగా మొక్కలు నాటే లక్ష్యాలను నిర్దేశించారు. దీంతో అన్ని శాఖలు కూడా మొక్కలు నాటేందుకు సన్నద్ధమవుతున్నాయి.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

జిల్లాలో 2024-25 సంవత్సరంలో 21.61లక్షల మొక్కలను నాటారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 20.90 లక్షల మొక్కలను నాటేందుకు ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. జిల్లాలో మొత్తం 428 గ్రామపంచాయతీలు, ఆరు మునిసిపాలిటీలు ఉన్నాయి. గ్రామాలు, పట్టణాల్లో విరివిగా మొక్కలు నాటేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. జిల్లాలోని గ్రామీణాభివృద్ధి శాఖ 10.39 లక్షల మొక్కలు, అటవీశాఖ 72 వేలు, వ్యవసాయ శాఖ 31,900, ఉద్యానవన శాఖ 63,800, పంచాయతీ శాఖ 2లక్షలు, సాగునీటి శాఖ 22వేలు, రోడ్లు, భవనాల శాఖ 15వేలు, పంచాయతీ రాజ్ శాఖ 15 వేలు, ఆబ్కారీ శాఖ 54,500, పరిశ్రమల శాఖ 25 వేలు, రెవెన్యూ 19,600, భువనగిరి, ఆలేరు, యాదగిరిగుట్ట, చౌటుప్పల్, మోత్కూరు,భూదాన్ పోచంపల్లి మునిసిపాలిటీల్లో 4.94లక్షల మొక్కలను నాటేందుకు జిల్లాయంత్రాంగం లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈసారి శాఖలవారీగా మొక్కలు నాటాల్సిన స్థలాలను ముందుస్తుగానే ఎంపిక చేసుకుని, మొక్కలను తరలించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంది. ఇప్పటికే ఆయా ప్రాంతాలకు మొక్కలను తరలించేందుకు చర్యలు చేపట్టింది. జిల్లాలోని అన్ని మునిసిపాలిటీల్లోనూ మొక్కలు నాటే కార్యక్రమం కొనసాగుతోంది.

గ్రామానికో నర్సరీ ఏర్పాటు

గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గ్రామానికో నర్సరీని ఏర్పాటుచేశారు. నర్సరీల్లో పెరుగుతున్న మొక్కల్లో 10శాతం వరకు చనిపోయినా... లక్ష్యానికి తగ్గకుండా ఉండేందుకు 15శాతం అదనంగా మొక్కలు పెంచేందుకు చర్యలు తీసుకున్నారు. జిల్లాలో మొత్తం 451 నర్సరీలను ఏర్పాటు చేశారు. వీటిలో గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించినవి 418 నర్సరీల్లో దాదాపు 20.90లక్షలు మొక్కలను, అటవీశాఖ నుంచి 18 నర్సరీల్లో, మునిసిపల్ శాఖ 15 నర్సరీల్లో -

మిగతా 8వ పేజీలో...

50 రకాల మొక్కలు..

యాదగిరిగుట్ట రూరల్: జిల్లావ్యాప్తంగా సుమారు 50 రకాల మొక్కలు నాటేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. నాటిన ఒక్కో మొక్కను రెండేళ్ల వరకు సంరక్షించనున్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లాలో 380 గ్రామపంచాయతీలు, ఆరు మున్సిపాలిటీల్లో రెండేసి నర్సరీల చొప్పున మొక్కలు పెంచుతున్నారు. జిల్లావ్యాప్తంగా నర్సరీల్లో మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నాయి. ప్రతీ నర్సరీకి సుమారు రూ.1.20లక్షల వరకు ఖర్చు చేయనున్నట్లు తెలిసింది.

మొక్కల సంరక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు

జిల్లావ్యాప్తంగా ఆయా నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు ఎండకాలంలో ఎండను తట్టుకోవడానికి వాటిని రక్షించేందుకు సంబంధిత అధికారులు నర్సరీలకు షేడ్‌నెట్స్ ఏర్పాటు చేయించి ప్రతీరోజు మొక్కలు ఎండిపోకుండా నీరు అందిస్తున్నారు. ప్రధానంగా అటవీశాఖ, డీఆర్‌డీవో అధికారులు పర్యవేక్షణ చేస్తూ వారి ఆధ్వర్యంలో కొనసాగిస్తూ సంబంధిత అధికారులకు తగిన సలహాలు, సూచనలు చేస్తున్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



వంటలను పరిశీలిస్తున్న ఆర్డీవో కృష్ణారెడ్డి

భువనగిరి రూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని భువనగిరి ఆర్డీవో ఎం.కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బొల్లేపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల బోధన, సామర్థ్యాలను పరిశీలించి విద్యార్థులకు సూచనలు చేశారు. వంటశాలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఇసుక ఎక్కడి నుంచి తెప్పించుకుంటున్నారని అడిగారు. గ్రామం నుంచే ఇసుకను తెచ్చుకుంటున్నామని తెలుపగా, ఇసుక రేటు తదితర అంశాలను పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు ఎంత ఇసుక అవసరమవుతుందో నమోదు చేసుకుని, వారికి తక్కువ ధరకు వచ్చేలా చూడాలన్నారు. మేస్త్రీలతో మాట్లాడి త్వరగా ఇళ్ల నిర్మాణాలు చేయాలన్నారు. ఆయనవెంట ఎంపీవో ఎం.దినకర్, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

వలిగొండ: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని జడ్పీ సీఈవో శోభారాణి సూచించారు. శుక్రవారం మండలంలోని లోతుకుంట గ్రామంలో కేజీబీవీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని, పరిశుభ్రత పాటించాలని సిబ్బందిని ఆదేశించారు. అంతకు ముందు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జితేందర్‌రెడ్డి, ఎస్‌వో దుర్గా, పంచాయతీ కార్యదర్శి జ్యోతి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమమే

చేనేత జనసమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రమేష్



చేనేత సమస్యలపై వినతిపత్రాన్ని అందజేస్తున్న చేనేత జన సమాఖ్య నాయకులు

భూదాన్‌పోచంపల్లి,జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కాలం గడుస్తున్నా చేనేత సమస్యలు పరిష్కారానికి నోచలేదని, చేనేత సమస్యలు పరిష్కరించకుంటే పెద్దఎత్తున ఉద్యమిస్తామని చేనేత జనసమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చింతకింది రమేష్ అన్నారు. చేనేత, జౌళీ శాఖ ఏడీ శ్రీనివాస్‌రావును శుక్రవారం కలిసిన నాయకులు పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. జియోట్యాగ్ కలిగిన ప్రతీ చేనేత కళాకారునికి సహకార సంఘంలో సభ్యత్వం కల్పించి తక్షణమే సహకార సంఘం ఎన్నికలు జరిపించాలన్నారు. నేసిన వస్త్రాలు ప్రైవేటు వ్యక్తుల దగ్గర గిట్టుబాటు లేక మాస్టర్ వీవర్స్ కూలీ కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తక్షణమే చేనేత వస్త్రాల కొనుగోలు ఏర్పాటుచేసి చేనేత కళాకారులను ఆదుకోవాలన్నారు. చేనేత రుణమాఫీ ప్రకటన చేసి తొమ్మిది నెలలు గడుస్తున్నా నేటి వరకు అమలుకు నోచుకోలేదన్నారు. నూలుపై 40శాతం సబ్సిడీ ఇచ్చి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో చేనేత జనసమాఖ్య జిల్లా అధ్యక్షుడు కర్నాటి పురుషోత్తం, గౌరవాధ్యక్షుడు వేశాల మురళి, ఉపాధ్యక్షులు రాపోలు సత్యనారాయణ, మిర్యాల నాగార్జున, ఆటిపాముల మహేందర్, ఈపూరి విష్ణు, బింగి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశాల సంఖ్య పెంచాలి



విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

» నాణ్యమైన విద్య అందించాలి

» కలెక్టర్ ఎం. హనుమంతరావు

భువనగిరి (కలెక్టరేట్), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో ఈ విద్యా సంవత్సరంలో ఎక్కువ ప్రవేశాలు ఉండేలా చూడాలని కలెక్టర్ ఎం.హనుమంతరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా ఇంటర్మీడియట్, జిల్లా విద్యాశాఖలకు సంబంధించి జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. 2025-26 విద్యా సంవత్సరంలో విద్యా బోధనకు మెరుగైన ప్రమాణాలు పాటించి అత్యుత్తమ ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యా వ్యవస్థలో ఎలాంటి మార్పులతో లక్ష్యం నెరవేరుతుందో అలాంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులపై ఒత్తిడి పెరగకుండా వారానికి ఒకసారి స్లిప్ టెస్టులు నిర్వహిస్తూ ఇప్పటి నుంచే వార్షిక పరీక్షలకు సిద్ధమయ్యేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. విద్యార్థుల పరిజ్ఞానాన్ని బట్టి స్పెషల్ క్లాసులు తీసుకోవాలన్నారు. ప్రతీ విద్యార్థికి అభ్యాస దీపిక ఇవ్వాలన్నారు. నిత్యం ఉదయం ప్రార్థనలో వ్యక్తిగత పరిశుభ్రత, మత్తు పదార్థాలు అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్యపరంగా బలహీనంగా ఉండే విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని హెల్త్ చెకప్ చేయాలన్నారు. లెక్చరర్లు, ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేలా నాణ్యమైన విద్యా బోధన చేసి, రాష్ట్రంలో యాదాద్రి భువనగిరి జిల్లాను అగ్రస్థానంలో నిలపాలన్నారు. ఇటీవల పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సైకిళ్లను అందజేశామని, ఈ విద్యా సంవత్సరంలో కూడా 200 సైకిళ్లను పంపిణీ చేస్తామన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని, భోజనంపై ప్రధానోపాధ్యాయులు, కమిటీ సభ్యులు నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు.మధ్యాహ్న భోజనంపై ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమీక్షలో జిల్లా విద్యాశాఖాధికారి కే.సత్యనారాయణ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రమణి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి టీ.నాగిరెడ్డి, విద్యాశాఖ ఏడీ ప్రశాంత్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీశ్యాంసుందర్, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఇబ్బందులు పెట్టొద్దు

యాదగిరిగుట్ట రూరల్: వసతిగృహాల్లో విద్యార్థులను ఇబ్బందులు పెట్టవద్దని కలెక్టర్ హనుమంతరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక బీసీ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వారికి కేటాయించిన నూతన మెనూ ప్రకారంగా భోజనం పెట్టాలన్నారు. విద్యార్థులతో మాట్లాడుతూ సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

30లోగా సన్నబియ్యం

తీసుకోవాలి

అదనపు కలెక్టర్ జీ. వీరారెడ్డి

భువనగిరి (కలెక్టరేట్), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలకు సంబంధించి ఒకేసారి అందజేస్తున్న సన్నబియ్యాన్ని లబ్ధిదారులు ఈ నెల 30లోగా తీసుకోవాలని అదనపు కలెక్టర్ జీ. వీరారెడ్డి శుక్రవారం తెలిపారు. ప్రభుత్వం జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించి ఒకేసారి సరఫరా చేస్తుందన్నారు. సన్నబియ్యం తీసుకోవడానికి జూన్ 30 గడువుగా నిర్ణయించిందని, తదుపరి పొడిగింపు ఉండదన్నారు. రేషన్ డీలర్లు లబ్ధిదారులకు తెలియజేసి మూడు నెలల సన్నబియ్యం పంపిణీ పూర్తి చేయాలన్నారు.

ఎమర్జెన్సీపై కాంగ్రెస్

నోరు విప్పాలి

● బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



7

రాచకొండలో రిజర్వాయర్‌ను ఏర్పాటు చేయాలి

» సాగు నీటిని అందించాలి » సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి



మహాసభలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకటరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు

సంస్థాన్ నారాయణపురం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): చర్లగూడెం ప్రాజెక్టునుంచి లిఫ్ట్ ద్వారా రాచకొండలో రిజర్వాయర్ ఏర్పాటుచేసి సంస్థాన్‌నారాయణపురం, చౌటుప్పల్ మండలాలకు సాగునీరందించాలని సీపీఐ జాతీయ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి డిమాండ్‌చేశారు. సంస్థాన్ నారాయణపురం మండలకేంద్రంలో శుక్రవారం సీపీఐ మండల మహాసభ జరిగింది. సీపీఐ జెండాను ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు, నితీష్‌కుమార్ బీజేపీ వ్యతిరేక ఫ్రంట్‌లో పని చేశారని, కానీ ప్రస్తుతం వారి మద్దతుతోనే బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారం కోసం పార్టీలు మారుతున్నారని గుర్తుచేశారు. లెఫ్ట్ పార్టీలు కలిసి ఒకే జెండా, ఒకే గుర్తుతో ముందుకు పోవాలని అభిప్రాయపడ్డారు. కమ్యూనిస్టులు ఐక్యమైతే ప్రజలంతా మన వైపు ఉండే అవకాశం ఉందన్నారు. ప్రపంచ దేశాల్లో కమ్యూనిస్టులే కీలకంగా ఉన్నారని గుర్తుచేశారు. ఆయుధాలు వదిలి నక్సలైట్లు జనంలోకి వచ్చి పోరాడాలన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ మునుగోడు నియోజకవర్గానికి సాగునీరందించే శివన్నగూడెం ప్రాజెక్టును పూర్తిచేసి సంస్థాన్ నారాయణపురం, చౌటుప్పల్ మండలాలకు సాగునీటిని అందించాలన్నారు. మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం క్రూరంగా వ్యవహరిస్తోందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చే బాధ్యత ఆ ప్రభుత్వంపై ఉందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే బీఆర్ఎస్‌కు చెప్పినట్లే ప్రజలు బుద్ధి చెప్తారన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసంరానున్న రోజుల్లో మరిన్ని ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. మహాసభలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు బచ్చనగోని గాలయ్య, యానాల దామోదర్ రెడ్డి, బొల్లమోని సత్యనారాయణ, మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఇమ్రాన్, నాయకులు చిలువేరు అంజయ్య, పొట్ట శంకరయ్య, కలకొండ సంజీవ, జగన్, కందుల లింగమ్మ, దేశిడి నరేందర్ రెడ్డి, రుద్ర రాములు, పల్లె మల్లారెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

24 గంటలు వైద్య సేవలందించాలి

» డీసీహెచ్‌ఎస్ చిన్నానాయక్ » ఐదుగురు డాక్టర్లకు షోకాజ్ నోటీసులు

రామన్నపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రామన్నపేట ఏరియా ఆస్పత్రిలో 24 గంటలు వైద్య సేవలు అందించాలని డీసీహెచ్‌ఎస్ చిన్నానాయక్ అన్నారు. రామన్నపేట ఏరియా ఆసుపత్రిని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. కలెక్టర్ హనుమంతరావు ఈ నెల 26న ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన సమయంలో సమాచారం లేకుండా ఐదుగురు డాక్టర్లు గైర్హాజరైనట్లు గుర్తించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఐదుగురు డాక్టర్లకు షోకాజ్ నోటీస్‌లు జారీ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ఆస్పత్రి పరిసరాలు, వార్డులను కలియతిరిగి పరిశీలించారు. శానిటేషన్ ఇంకా మెరుగుపర్చాలని సూపర్‌వైజర్‌కు నోటీసులు జారీచేశారు. రెండురోజుల్లో ఆర్‌వీ ప్లాంట్లను అందుబాటులోకి తెచ్చి రోగులకు తాగునీటిని అందిస్తామన్నారు. ప్రతీ మంగళవారం ఫిజీషియన్ డాక్టర్‌ను అందుబాటులో ఉంచేలా, ప్రసూతి వైద్యులు 24 గంటలపాటు అందుబాటులో ఉండి సేవలందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రి వైద్యులు, నర్సింగ్, పారామెడికల్ సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. రోగులకు మెరుగైన వైద్యసేవలందించి మన్ననలు పొందాలని సూచించారు. సమయపాలన పాటించని సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని చిన్నానాయక్ హెచ్చరించారు. డీసీహెచ్‌ఎస్ వెంట వైద్యులు వీరన్న, నాగేశ్వర్‌రావు, మాధవచారి, దేవేందర్, రాజగోపాల్, నవీన్‌సింగ్, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, హెడ్ నర్సులు రాణి, సువర్ణ, ల్యాబ్ ఇంచార్జ్ శ్రీనివాసులు ఉన్నారు.

టెండరుదారుల నిరాసక్తత

23కు వచ్చినవి ఆరు మాత్రమే

7

వార్డు అధికారులు అందుబాటులో ఉండాలి

● అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

భువనగిరి టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ వార్డు అధికారులు నిత్యం తమవార్డు ప్రజలకు అందుబాటులో ఉండాలని అదనపు కలెక్టర్, భువనగిరి మునిసిపల్ స్పెషల్ ఆఫీసర్ భాస్కరరావు అన్నారు. శుక్రవారం నిర్వహించిన మునిసిపల్ సమీక్ష సమావేశంలో అయన మాట్లాడారు. వార్డు అభివృద్ధి,పన్ను వసూళ్లు, భవనాల నిర్మాణం తదితర మునిసిపల్ సేవలన్నిటినీ వార్డుల్లో పర్యవేక్షించాల్సిన బాధ్యత వార్డు అధికారులదేనన్నారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ,పారిశుధ్యం,వీధిలైట్లు, నీటి సరఫరా తదితర పనులను పర్యవేక్షించాల్సింది వార్డు అధికారులేనని స్పష్టంచేశారు. విధుల నిర్వహణలో అలసత్వం చూపితే చర్యలు తప్పవన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేసేలా లబ్ధిదారులను అధికారులు ప్రోత్సహించాలన్నారు. కార్యాలయ నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలని, అవినీతికి ఆస్కారం ఇవ్వొద్దన్నారు. సాగుతున్న చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ఆస్తిపన్ను, నీటి చార్జీలు, ట్రేడ్ లైసెన్స్ తదితర పన్నుల వసూళ్ల తీరును సమీక్షించి పలు సూచనలు చేశారు. కమిషనర్ జి.రామలింగం, డీఈ కొండల్‌రావు అధికారులు పాల్గొన్నారు.

వచ్చేనెల 31 లోగా రెవెన్యూ సమస్యల పరిష్కారం

● అదనపు కలెక్టర్ వీరారెడ్డి



మోత్కూరు తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

మోత్కూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నిర్వహించిన 'భూభారతి' రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను జూలై 31 నాటికి పరిష్కరించేలా కృషి చేస్తున్నామని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వీరారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మోత్కూరు తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. మోత్కూరు మండలంలో రెవెన్యూ సదస్సులో 704 దరఖాస్తులు వచ్చాయని, వాటి పరిశీలన ఈ నెల 28కి పూర్తి కావాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఇక్కడ పరిశీలన పూర్తయ్యాక వాటిని డివిజన్‌స్థాయిలో పరిశీలించాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇక్కడ దరఖాస్తుల పరిశీలన పూర్తయిన వెంటనే ఈ నెల 29, జూలై 5 మధ్య ఫిర్యాదుదారులకు నోటీసులు పంపి, ఆర్ఐలు, రెవెన్యూ సిబ్బందితో క్షేత్రస్థాయిలో విచారణ జరిపించి జూలై 16లోపు నివేదికలు ఉన్నతాధికారులకు పంపిస్తారన్నారు. జూలై 17 నుంచి 31 వరకు తహసీల్దార్ ఉత్తర్వులు జారీ చేసి, అంగీకరించిన రైతుల భూమి వివరాలు మాడ్యూల్‌లో నమోదు చేస్తారన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యాక రైతుల నుంచి నిర్ణీత ఫీజు తీసుకుని ఆగస్టు 15 నాటికి కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. రెవెన్యూ అధికారులు ఇచ్చే నోటీసులు ప్రతీ రైతు తీసుకోవాలని, ఏవైనా అభ్యంతరాలుంటే తహసీల్దార్ కార్యాలయంలో రాతపూర్వకంగా ఇవ్వాలన్నారు. వాటిని పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. అంతకు ముందు మోత్కూరు జడ్పీహెచ్‌ఎస్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులను, వంట ఏజెన్సీ, ఉపాధ్యాయులను ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రైవేటు పాఠశాలల నుంచి ఎంతమంది విద్యార్థులు వచ్చారనిఅడగ్గా,50 మంది వచ్చారని ఇన్‌చార్జి హెచ్‌ఎం అరవిందరాయుడు చెప్పారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నందున అదనంగా మూత్రశాలలు నిర్మించాలని హెచ్‌ఎం కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. తహసీల్దార్ పి.జ్యోతి, డీటీ ఉపేందర్, ఆర్ఐలు సుమన్, శ్రీనివాస్ ఆయన వెంట ఉన్నారు.

ఆత్మకూరు(ఎం): భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి అన్నారు. అదనపు కలెక్టర్ ఆత్మకూరు(ఎం) తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూభారతి, రేషన్ కార్డుల దరఖాస్తుల వివరాలను తహసీల్దార్ వి.లావణ్యను అడిగి తెలుసుకున్నారు. రేషన్‌కార్డుల నుంచి లబ్ధిదారుల తొలగింపు, కొత్త సభ్యుల చేర్పులు, కొత్త రేషన్‌కార్డుల సమస్యలను పూర్తిచేయాలని సూచించారు.

ఆరుగురు ఏఎస్ఐలకు ఎస్ఐలుగా పదోన్నతి

నల్లగొండ క్రైం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఆరుగురు ఏఎస్ఐలకు ఎస్ఐలుగా ప్రమోషన్ కల్పిస్తూ ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదోన్నతులతో పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించే దిశగా పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా పదోన్నతులు పొందిన ఏఎస్ఐలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు జయరాం తదితరులు ఉన్నారు.

సారా అక్రమ రవాణా చేస్తే చర్యలు

హుజూర్‌నగర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సారా తయారు చేసి అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎక్సైజ్ అధికారి లక్ష్మానాయక్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో సర్కిల్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన 23 వాహనాలకు శుక్రవారం వేలం నిర్వహించారు. అయా వాహనాలకు రూ.3.6 లక్షలు ఆదాయం లభించిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సారా రవాణా చేసే వారిపై నిఘా ఏర్పాటుచేసి కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎక్కువసార్లు పట్టుబడిన వారిపై పీడీయాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ నాగార్జునరెడ్డి, ఎస్ఐలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

చిలుకూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): చిలుకూరు మండలకేంద్రంలో శుక్రవారం విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందింది. బాధితుడు మాధవరపు చిన్న వెంకటి తెలిపిన వివరాల ప్రకారం.. రోజు మాదిరిగానే మేత కోసం పొలాలకు వెళ్లిన సమయంలో జానకీనగర్ స్టేజీ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న తీగలకు ప్రమాదవశాత్తు గేదెలు తగలటంతో పాడి గేదె మృతిచెందింది. గేదె విలువ రూ.90 వేల ఉంటుందని బాధితుడు తెలిపారు.

వివాహేతర సంబంధంతోనే హత్య

● నకిరేకల్ మండలం నోముల గ్రామంలో యువకుడిని కొట్టి చంపిన కేసులో ముగ్గురు అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న నకిరేకల్ సీఐ రాజశేఖర్

నకిరేకల్,జూన్ 27(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం నోముల గ్రామంలో నర్సింగ్ జానయ్య కొట్టి హత్య చేసిన కేసులో ముగ్గురిని నకిరేకల్ పోలీసులు అరెస్టు చేశారు. నకిరేకల్‌లో సీఐ పి.రాజశేఖర్ శుక్రవారం కేసు వివరాలను వెల్లడించారు. నోముల గ్రామానికి చెందిన నర్సింగ్ జానయ్య(34) ఈ నెల 20న వివాహేతర సంబంధం కొనసాగించే మహిళ ఇంటికి వెళ్లాడు. దీంతో అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు జానయ్యను చీరతో చెట్టుకు కట్టేసి కళ్లలో కారం చల్లి కర్రలతో, పత్తిచేల్లో గడ్డి చెక్కే పారతో తీవ్రంగా కొట్టారు. జానయ్యను చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అదే రోజు రాత్రి మృతి చెందాడు. ఈ నేపథ్యంలో నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విచారణ చేపట్టగా ఈ నెల 27వ తేదీన ఉదయం 6.10 గంటలకు సమయంలో తాటికల్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద నోముల గ్రామానికి చెందిన మృతుడి తల్లి నర్సింగ్‌ప్రమీల ఫిర్యాదు మేరకు జానయ్య హత్య కేసులో చవ్వా ధనలక్ష్మి, చవ్వా నాగరాజు, చవ్వా దివ్యను అరెస్టు చేసి విచారించగా నేరాన్ని ఒప్పుకున్నట్లు చెప్పారు. చవ్వా ధనలక్ష్మి తమ గ్రామానికి చెందిన జానయ్యతో కొంత కాలంగా వివాహేతర సంబంధం పెట్టుకుందని ఈ విషయంలో ధనలక్ష్మికి, ఆమె భర్త మధ్య గొడవలు జరిగాయన్నారు. జానయ్యను చంపితే వారి మధ్య ప్రశాంతత ఉంటుందని భావించి పథకం ప్రకారం ధనలక్ష్మి ఈనెల 20న జానయ్యను ఇంటికి పిలిపించుకుందన్నారు. జానయ్య ఇంటి వెనుక నుంచి ఇంట్లోకి రాగానే ధనలక్ష్మి, ఆమె భర్త నాగరాజు కలిసి జానయ్యను పట్టుకోగా కుమార్తె దివ్య కారంపొడి తీసుకవచ్చి జానయ్య కండ్లలో గుప్పిందన్నారు. అనంతరం జానయ్యను ఇంటి ఎదురుగా ఉన్న చెట్టుకు కట్టివేసి ధనలక్ష్మి కర్రతో, పత్తిచేనులో గడ్డి చెక్కే పారతో కొట్టగా నాగరాజు కర్రతో తీవ్రంగా కొట్టారు. తీవ్రంగా గాయపడిన జానయ్యను నల్లగొండ ఆస్పత్రికి అంబులెన్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి చనిపోయాడు. నేరస్థలం నుంచి రెండు కర్రలు, తాడు, చీరను స్వాధీనం చేసుకున్నామన్నారు. నేరస్తులైన చవ్వా ధనలక్ష్మి కూలీ పనులు చేసుకొని జీవిస్తుండగా చవ్వా నాగరాజు ఆటో నడుపుతాడని దివ్య విద్యను అభ్యసిస్తుందన్నారు. ఈ కేసును ఛేదించిన నకిరేకల్ సీఐ రాజశేఖర్, ఎస్ఐ బి.లచ్చిరెడ్డి, టి.కృష్ణాచారి, సిబ్బంది ఎం. శ్రీనివాస్, వి.సురేష్, డి. శ్రీకాంత్, జనార్ధన్, మధుకర్, వెంకటేశ్వర్లును ఎస్పీ శరత్ చంద్రపవార్ అభినందించారు.

అక్రమంగా హద్దురాళ్లు పాతారని..

● తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెట్రోల్ బాటిళ్లతో రైతుల ఆందోళన ● నల్లగొండ జిల్లా నిడమనూరులో ఘటన

నిడమనూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తాతల కాలం నాటి నుంచి తాము కబ్జాలో ఉంటున్న భూమిలో రెవెన్యూ అధికారులు అక్రమంగా హద్దురాళ్లు పాతారని ఆరోపిస్తూ రైతులు పెట్రోల్ బాటిళ్లతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. నల్లగొండ జిల్లా నిడమనూరు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం జరిగింది. నిడమనూరు మండలం ముప్పారం గ్రామానికి చెందిన తెల్కపల్లి చినవెంకయ్య 45 ఏళ్ల క్రితం ఇతరుల వద్ద 720 సర్వే నంబరులో 10 ఎకరాల భూమిని కొనుగోలు చేసి సేద్యం చేసుకున్నాడు. ఆయన తదనంతరం వారసులు, మనవళ్లు కూడా ఆ భూమిలో సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కానీ అదే గ్రామానికి చెందిన చెరుకుపల్లి అశోక్ పట్టా కంటే తనకు భూమి తక్కువ ఉందని, సర్వే చేయాలని ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధికారులు సర్వే చేసి చిన వెంకయ్య భూమిలో హద్దురాళ్లు పాతారు. 45 ఏళ్లుగా ఆ భూమిలో తాము కబ్జా ఉండగా తమకు తెలియకుండా హద్దురాళ్లు ఎలా పెడతారని ఆయన మనవళ్లు తెల్కపల్లి శంకర్, తెల్కపల్లి రాజు, తెల్కపల్లి ప్రసాద్, తెల్కపల్లి అశోక్, తెల్కపల్లి నాగరాజు, తెల్కపల్లి నవీన్ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి భూమి కొనుగోలుకు సంబంధించిన దస్తావేజు పత్రాలను తహసీల్దార్‌కు చూపించగా ఇవి పనికి రావు అని విసిరివేశారు. దీంతో మనస్తాపానికి గురై పెట్రోల్ బాటిళ్లతో ఆందోళనకు దిగారు. ఇంతలో సిబ్బంది వచ్చి నచ్చజెప్పారు. భూమి కొనుగోలుకు సంబంధించిన పత్రాలు తమ వద్ద ఉన్నాయని రైతులు తెలిపారు. తహసీల్దార్ తమ పట్ల దురుసుగా ప్రవర్తించారని, చస్తే మాకేంటని అనడంతో మనస్తాపానికి గురయ్యామని రైతులు వాపోయారు.

తహసీల్దార్ వివరణ

పెట్రోల్ బాటిళ్లతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు ఆందోళన చేసిన విషయం గురించి తహసీల్దార్ జంగాల కృష్ణయ్యను వివరణ కోరగా దళితుల భూమిని ఆక్రమించినట్లు ఫిర్యాదు రావడంతో సర్వే చేసినట్లు చెప్పారు. అదే విషయం చెబుతుండగా వారే దురుసుగా ప్రవర్తించి కుర్చీలను తన్నారని తెలిపారు. సీసీ పుటేజీ గమనించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు.

బైండోవర్ నిబంధనలు ఉల్లంఘన

● సూర్యాపేట జిల్లాలో ఇద్దరు వ్యక్తుల నుంచి రూ. 2 లక్ష నగదు జప్తు

సూర్యాపేటక్రైం, జూన్ 27, (ఆంధ్రజ్యోతి): బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించిన ఇద్దరు వ్యక్తుల నుంచి పూచీకత్తుగా ఉన్న నగదును జప్తు చేసినట్లు సూర్యాపేట ఎస్పీ కొత్తపల్లి నర్సింహ తెలిపారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం మిర్యాల గ్రామానికి చెందిన కనకటి వెంకన్న, కనకటి శ్రవణ్‌పై గతంలో ఉన్న కేసుల నేపథ్యంలో దాదాపుగా 9నెలల క్రితం స్థానిక పోలీసులు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఇద్దరు వ్యక్తులు ఏడాది పాటు ఎలాంటి నేరాలకు పాల్పడకుండా ఉండాలి. లేకుంటే ఒక్కొక్కరు రూ.లక్ష చొప్పున చెల్లించాల్సి ఉంటుందని బైండోవర్ సమయంలో పేర్కొన్నారు. ఈ క్రమంలో వెంకన్న, శ్రవణ్ ఈ ఏడాది మార్చిలో మిర్యాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మెంచు చక్రయ్యను హత్య చేసిన ఘటనలో ప్రధాన నిందితులుగా ఉన్నారు. ఇద్దరిపై పోలీసులు పీడీ యాక్టు నమోదు చేసి చంచల్‌గూడ జైలుకు పంపారు. కాగా బైండోవర్ కాలపరిమితిలో ఉండగానే హత్యానేరానికి పాల్పడడంతో ఇద్దరు వ్యక్తుల నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.లక్ష నగదును జప్తు చేసి ప్రభుత్వ ఖాతాలో జమ చేసినట్లు చెప్పారు. అలవాటుగా నేరాలకు పాల్పడే వారిని, ప్రజలను ఇబ్బందులకు గురి చేసే వారిని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని మళ్లీ నేరాలకు పాల్పడకుండా ఉండేందుకు తహసీల్దార్ వద్ద ఆరు నెలలు, ఏడాది కాలానికి బైండోవర్ చేయనున్నట్లు చెప్పారు అలాంటి వారిలో మార్పు కోసం బైండోవర్ చేస్తామని ఒకవేళ బైండోవర్ నిబంధనలు ఉల్లంఘిస్తే పూచీకత్తుకు బైండోవర్ చేయబడ్డారో మొత్తం జప్తు చేయడం జరుగుతుందన్నారు.

హోటల్ నిర్వాహకులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలి


హోటల్‌లో ఆహార పదార్థాలను తనిఖీ చేస్తున్న అధికారులు

సూర్యాపేటటౌన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): హోటల్ నిర్వాహకులు ఆహార పదార్థాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఫుడ్ సేఫ్టీ సూర్యాపేట జిల్లా అధికారి బి.ప్రభాకర్ సూచించారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 30 ఆహార వ్యాపార దుకాణాలను పరిశీలించి అవగాహన కల్పించారు. ఫుడ్ సేఫ్టీ ఆన్‌వీల్స్ మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌ను ఉపయోగించి తక్షణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆహార విక్రయ నిర్వాహకులు నూనె, కారం, పసుపు, మసాలా, టీపొడి, పాల నాణ్యతా ప్రమాణాలను పాటించాలన్నారు. ఈడ్రైవ్‌లో గుర్తించిన టీ పొడి, ఫిల్టర్ పెప్పర్ స్పాట్ టెస్ట్, నూనెను టీపీసీ మీ టర్ టెస్టు, నిర్వహించగా కొన్ని నమూనాల్లో ఆహార పరిరక్షణ ప్రమాణాల లోపాలు ఉన్నట్లు గుర్తించి వెంటనే వాటిని ధ్వంసం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ ఎం. వెంకటపతి, శాంపిల్ అసిస్టెంట్ సంతోష్, మహేష్ పాల్గొన్నారు.

నల్లగొండ జిల్లాలో రైళ్ల రాకపోకల వివరాలు

మిర్యాలగూడ మీదుగా.. గుంటూరు, విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం వైపునకు..

నెం	ట్రైన్ నెం	రైలు పేరు	వచ్చేది	పోయేది	వారం
1.	07609	పూర్ణ- తిరుపతి స్పెషల్	00-13	00-15	గురువారం
2	17232	నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్	01-29	01-30	ఆది/మంగళ
3	17222	లోకమాన్యతిలక్-విశాఖ ఎక్స్‌ప్రెస్	04-14	04-15	సోమ/శుక్ర
4	12806	జన్మభూమి సూపర్‌ఫాస్ట్	08-57	08-58	డైలీ
5	12756	భావ్‌నగర్ సూపర్‌ఫాస్ట్	09:30	09:31	ఆదివారం
6	07791	కాచిగూడ-నడికుడి	11:55	11:57	ఆదివారం మినహా
7	07046	సికింద్రాబాద్-డిబ్రూఘర్ స్పెషల్	13:05	13:06	సోమవారం
8	07638	శ్రీనగర్ - తిరుపతి	13:06	13:07	మంగళవారం
9	07699	నాగర్‌సోల్-బెజవాడ	13:10	13:11	ఆదివారం
10	17230	శబరి ఎక్స్‌ప్రెస్	14:22	14:23	డైలీ
11	17645	రేపల్లె ఎక్స్‌ప్రెస్	14:46	14:47	డైలీ
12	12704	ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్	17:54	17:55	డైలీ
13	12748	పల్నాడు ఎక్స్‌ప్రెస్	18:00	18:01	డైలీ
14	17016	విశాఖ ఎక్స్‌ప్రెస్	18:44	18:45	డైలీ
15	12604	చెన్నై సూపర్‌ఫాస్ట్	19:14	19:15	డైలీ
16	12734	నారాయణాద్రి సూపర్‌ఫాస్ట్	20:04	20:05	డైలీ
17	07446	లింగంపల్లి- కాకినాడస్పెషల్	20:54	20:55	మంగళ, గురు, శని
18	08580	సికింద్రాబాద్ - విశాఖ స్పెషల్	21:30	21:32	గురువారం
19	07509	హైదరాబాద్ - తిరుపతి స్పెషల్	22:02	22:03	గురువారం
20	07435	నాగర్‌కోల్ వీక్లీ స్పెషల్	22:20	22:22	శుక్రవారం
21	07189	హెచ్‌సాహిబ్- ఈరోడ్ స్పెషల్	23:07	23:09	శుక్రవారం
22	08586	మహబూబ్‌నగర్-విశాఖపట్నం	23:10	23:12	బుధవారం
23	07165	హైదరాబాద్ - కటక్ స్పెషల్	23:10	23:12	గురువారం
24	67775	డెమో	23:40	---	డైలీ
25	07191	కాచిగూడ మధురై స్పెషల్	23:15	23:17	సోమవారం
26	07695	సికింద్రాబాద్-రామంతపురం స్పెషల్	23:20	23:21	బుధవారం
27	67777	డెమో	---	23:45	డైలీ

మిర్యాలగూడ మీదుగా.. నల్లగొండ, హైద్రాబాద్, సికింద్రాబాద్ వైపునకు..

నెం.	ట్రైన్ నెం	రైలు పేరు	వచ్చేది	పోయేది	వారం
1	07610	తిరుపతి- పూర్ణ స్పెషల్	01-20	01-21	బుధవారం
2	12603	చెన్నై సూపర్‌ఫాస్ట్	01:39	01:40	డైలీ
3	07192	మధురై- కాచిగూడ ఎక్స్‌ప్రెస్	01:45	01:47	గురువారం
4	07436	నాగర్‌సోల్ - కాచిగూడ వీక్లీ స్పెషల్	02:00	02:02	శుక్రవారం
5	12733	నారాయణాద్రి సూపర్‌ఫాస్ట్	02:43	02:45	డైలీ
6	08585	విశాఖ-మహబూబ్‌నగర్	02:45	02:47	బుధవారం
7	07632	నాగర్‌సోల్-హైదరాబాద్	02:45	02:47	సోమవారం
8	17015	విశాఖ ఎక్స్‌ప్రెస్	03:29	03:30	డైలీ
9	07445	కాకినాడ పోర్ట్-లింగంపల్లి ఎక్స్	03:39	03:40	మంగళ/గురు/శని
10	07510	తిరుపతి- హైదరాబాద్‌స్పెషల్	03:55	03:56	శనివారం
11	67778	డెమో	05:30	---	డైలీ
12	67776	డెమో	----	05:35	డైలీ
13	08579	విశాఖ-సికింద్రాబాద్	05:44	05:45	గురువారం
14	12703	ఫలక్‌నామా సూపర్‌ఫాస్ట్	06:51	06:52	డైలీ
15	07696	రామంతపురం-సికింద్రాబాద్	07:04	07:05	శనివారం
16	12747	పల్నాడు సూపర్‌ఫాస్ట్	07:40	07:41	డైలీ
17	17229	శబరి ఎక్స్‌ప్రెస్	08:32	08:33	డైలీ
18	17646	రేపల్లె ఎక్స్‌ప్రెస్	11:05	11:06	డైలీ
19	07047	డిబ్రూఘర్-సికింద్రాబాద్‌స్పెషల్	11:20	11:22	శనివారం
20	12755	భావ్‌నగర్ ఎక్స్‌ప్రెస్	11:32	11:33	గురువారం
21	12805	జన్మభూమి సూపర్‌ఫాస్ట్	15:10	15:11	డైలీ
22	17221	లోకమాన్యతిలక్ ఎక్స్‌ప్రెస్	15:29	15:30	బుధ/శని
23	07166	కటక్- హైద్రాబాద్	15:30	15:32	గురువారం
24	07792	డెమో	16:50	16:52	ఆదివారం మినహా
25	17231	నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్	16:59	17:00	శుక్ర/ఆది
26	07190	ఈరోడ్- నిడదవోలు	18:48	18:49	ఆదివారం
27	07698	బెజవాడ-నాగర్‌సోల్	19:24	19:25	శుక్రవారం

-(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడటౌన్)

పంచలోహ విగ్రహం విక్రయిస్తామని మోసం

● నలుగురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సీఐ చరమందరాజు

హుజూర్‌నగర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పంచలోహ విగ్రహం పేరుతో మోసగించిన నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం సీఐ చరమందరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ లోని పల్నాడు జిల్లా దుర్గి మండలం ఆడిగుప్పల గ్రామానికి చెందిన చల్లా పెద్దిరాజు, బత్తుల శ్రీను తమ వద్ద పంచలోహ వినాయకుడి విగ్రహం ఉందని, ఇంట్లో పెట్టుకుంటే మంచిదని హుజూర్‌నగర్ పట్టణానికి సయ్యద్ మదార్‌ను నమ్మించారు. దీంతో మదార్ విగ్రహాన్ని కొనుగోలు చేస్తానని వారికి తెలిపాడు. ఈ నేపథ్యంలో బత్తుల శ్రీనుకు పరిచయం ఉన్న కోదాడ ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఉప్పతల వినయ్, మద్దెల రజనికుమార్‌తో కలిసి పథకం ప్రకారం మదార్‌కు విక్రయించేందుకు ప్రయత్నించారు. ఈ నెల 26న మధ్యాహ్నం హుజూర్‌నగర్‌లోని రామస్వామి గట్టు వద్ద ఉంటున్న మదార్ ఇంటికి వెళ్లి పంచలోహ విగ్రహానికి డబ్బులు డిమాండ్ చేశారు. కానీ విగ్రహం ఇస్తే నే డబ్బులు ఇస్తానని మదార్ చెప్పాడు. దీంతో చల్లా పెద్దిరాజు, బత్తుల శ్రీను పంచలోహ విగ్రహానికి బదులుగా ఇత్తడి విగ్రహం అంటగట్టే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో మొదట రూ.1000లు ఇచ్చిన మదార్ అది పంచలోహ విగ్రహం కాదని గమనించి విగ్రహం వద్దని తన రూ. 1000 తనకు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో అక్కడి నుంచి వారిద్దరు పరారయ్యారు. అనంతరం మదార్ హుజూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

విచారణ చేపట్టిన హుజూర్‌నగర్ పోలీసులు శుక్రవారం అనుమానాస్పదంగా తిరుగుతున్న చల్లా పెద్దిరాజు, బత్తుల శ్రీను, మద్దెల రజనికుమార్ ఉప్పతల వినయ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్ చేసినట్లు సీఐ చరమందరాజు తెలిపారు. సమావేశంలో ఏఎస్ఐ బలరామిరెడ్డి, పోలీసులు నాగరాజు, కాశీ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన బైక్.. యువకుడి దుర్మరణం


ఘటన స్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

యాదగిరిగుట్ట రూరల్, జూన్ 27, (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు బైక్ డివైడర్‌ను ఢీ కొట్టడంతో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం మల్లాపురం గ్రామ శివారులో శుక్రవారం జరిగింది. స్థానిక ఎస్ఐ కిష్టస్వామి తెలిపిన వివరాల ప్రకారం..భువనగిరి మండలం నవాత్‌పల్లి గ్రామానికి చెందిన సాయికిరణ్ (25) పెయింటర్. భార్య గర్భిణి కావడంతో ఈ నెల 26న ఉదయం ఆమెను వైద్య పరీక్షల నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లాడు. అక్కడ పరీక్షల అనంతరం ఆమెను యాదగిరిగుట్ట మండలం వెంకటాపురంలో అత్తగారి ఇంటివద్ద దించి వెళ్లి పోయాడు. అదేరోజు సాయంత్రం 5-30 గంటలకు భువనగిరిలో భార్య పరీక్ష రిపోర్టును తీసుకొని తిరిగి గుట్ట నుంచి వెంకటాపురం వెళ్తుండగా బైక్ డివైడర్ ఢీకొని మృతి చెందాడు. శుక్రవారం ఉదయం స్థానికులు రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలం చేరుకొని సాయికిరణ్ మృతదేహం గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


అంజయ్య(ఫైల్)

తిప్పర్తి, జూన్ 27(ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం రామలింగాలగూడెం గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వనపర్తి అంజయ్య(47) తనఇంటి ఎదుట ఉన్న ట్యాంకులో నీళ్ల ఎక్కువ అయి పొర్లుతున్నాయి. ఈ క్రమంలో నీటిని మరోవైపు మళ్లించేందుకు ట్యాంకులో ఉన్న మరో పైపు తగిలించేందుకు ప్రయత్నించాడు. అదే ట్యాంకులో ఏర్పాటు చేసిన మినీ మోటర్ విద్యుత్ వైరు నీటిలో పడింది. గమనించని అంజయ్య షాక్‌కు గురై స్పృహ తప్పి పక్కనే పడిపోయాడు. ఐదు నిమిషాల తర్వాత గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నల్లగొండ ఆసుపత్రికి తరలించే క్రమంలో మార్గ మధ్యలో మృతి చెందాడు. ఈ మేరకు భార్య వినోద ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు.

భూ సమస్య పరిష్కరించాలని వెళ్తే ఎస్ఐ కొట్టాడు

నల్లగొండ జిల్లా తాస్కానిగూడెం గ్రామ రైతు ఆరోపణ


చికిత్స చేయించుకున్న అనంతరం ఓపీ చిటీని చూపుతున్న రైతు

చండూరు రూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): భూ తగాదాలో సమస్యను పరిష్కరించాలని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన తనను చండూరు ఎస్ఐ వెంకన్న అసభ్యంగా తిడుతూ కొట్టాడని నల్లగొండ జిల్లా చండూరు మండలం తాస్కానిగూడెం గ్రామానికి చెందిన రైతు ఆవుల వెంకన్న ఆరోపించాడు. బాధితుడు వెంకన్న ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం విలేకరులకు తెలిపారు. తాస్కానిగూడెంలో తనకున్న పొలంలో సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని, కొద్దికాలంగా తన బాబాయి అయిన ఆవుల అంజయ్యతో గెట్ల పంచాయితీ కొనసాగుతుండటంతో పెద్ద మనుషల సమక్షంలో పలుమార్లు పంచాయితీ పెట్టినా పరిష్కారం కాలేదన్నారు. ఈ ఘటనపై మే 23వ తేదీన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇరువర్గాల ఫిర్యాదుతో ఎస్ఐ వెంకన్న పిలిపించి పెద్ద మనుషల సమక్షంలో మాట్లాడుకోవాలని సూచించారన్నారు. అంజయ్య వినకపోగా తనపై గొడవకు దిగుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవుల వెంకన్న ఎస్ఐకు తెలిపాడు. ఈ క్రమంలో ఎస్ఐ వెంకన్న తనను గురువారం పోలీస్ స్టేషన్‌కు పిలిపించి అసభ్యంగా మాట్లాడి, కడుపులో, తలపై, మెడపై పిడిగుద్దులు గుద్దినట్లు చెప్పారు. దీంతో కడుపు నొప్పి, మెడనొప్పి రావడంతో బంధువుల సాయంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్స చేయించుకున్నానని తెలిపారు. తనను అన్యాయంగా కొట్టిన ఎస్ఐ వెంకన్నపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనపై సీఐ ఆదిరెడ్డిని వివరణ కోరగా, భూసమస్య, సివిల్ వ్యవహారాల్లో పోలీసులు ఎప్పుడూ జోక్యం చేసుకోరని తెలిపారు. తాస్కానిగూడెం గ్రామానికి చెందిన ఇరువురు గెట్ల పంచాయితీపై పెద్దమనుషలతో మాట్లాడుకోవాలని సూచించినా వినకుండా ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకోవడంతో వారిని పిలిపించి మాట్లాడుకోవాలని సూచించామని తెలిపారు. ఎవరిపై చేయి చేసుకోలేదని, ఆ గ్రామ పెద్ద మనుషల ఎదుట కావాలని పోలీసులపై వెంకన్న దురుసుగా ప్రవర్తించాడన్నారు. అయినా ఎలాంటి చర్యలు తీసుకోకుండా వదిలేశామని, సొంత పంచాయితీలకు పోలీసులపై అభాండాలు వేస్తున్నారని వివరించారు.

వరకట్న వేధింపులకు తాళలేక వివాహిత ఆత్మహత్య

సూర్యాపేటక్రైం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యకు యత్నించిన మహిళ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందిది.. డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపిన వివరాల ప్రకారం...సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం మునియానాయక్‌తండాకు చెందిన బానోతు బిందు (20)కు ఏడాది క్రితం అదే గ్రామానికి చెందిన ధరావత్ రమేష్‌తో వివాహమైంది. కొద్ది రోజులుగా బిందు భర్త రమేష్, అతడి తల్లిదండ్రులు అదనపు కట్నం తేవాలని తరుచూ ఆమె వేధిస్తున్నారు. వేధింపులు తాళలేక బిందు ఈనెల 20వ తేదీన పురుగుల మందు తాగింది. చికిత్స నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. బిందు తల్లి సాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

బార్ అండ్ రెస్టారెంట్‌పై చర్యలు తీసుకోవాలి


మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

చిట్యాల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): చిట్యాలలోని కనకదుర్గ బార్ అండ్ రెస్టారెంట్‌పై చర్యలు తీసుకోవాలని శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో మునిసిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. రెస్టారెంట్‌లో ఇస్తున్న ఆహారంలో నాణ్యత లేదని, కృత్రిమ రంగులు వాడుతున్నారని, అధిక ధరలు వసూలు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. టాయిలెట్స్ నిర్వహణ సరిగ్గా లేదని, బార్ ఎదుట పార్కింగ్ సౌకర్యం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కూనూరు సంజయ్ దాస్‌గౌడ్, గుండాల నరేష్, చికిలంమెట్ల అశోక్, మహలింగం పాల్గొన్నారు.

బార్ అండ్ రెస్టారెంట్‌కు జరిమానా: చిట్యాల పట్టణంలోని కనకదుర్గ బార్ అండ్ రెస్టారెంట్‌ను శుక్రవారం మునిసిపల్ సిబ్బంది తనిఖీ చేశారు. వంటగది, టాయిలెట్స్ పరిశుభ్రంగా లేకపోవడంతో బార్ యాజమాన్యానికి రూ. 2 వేల జరిమానా విధించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రవణ్ కుమార్, వార్డు ఆఫీసర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

దేవరకొండ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం తాటికోల వాగు నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను శుక్రవారం ఉదయం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు దేవరకొండ ఎస్ఐ నారాయణరెడ్డి తెలిపారు. వాగుల నుంచి ఇసుక అక్రమంగా రవాణా జరుగుతుందన్న సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా దేవరకొండ, మడమడక గ్రామాలకు ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకొని హరి, శ్రీను, కొండల్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

నేరేడుగొమ్ము : నేరేడుగొమ్ము మండలంలో అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను శుక్రవారం పట్టుకొని సీజ్ చేసినట్లు నేరేడుగొమ్ము ఎస్ఐ కోటేష్ తెలిపారు. ఇసుక అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించి పెద్దమునిగల్, బుగ్గతండా వాగుల నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.



ఆరుద్ర ఆగమనం..

వ్యవసాయంలో రైతులకు సాయంగా ఉండే జీవుల్లో ఆరుద్ర పురుగు ఒకటి. వాన చినుకులు పొలాలను తడిపిందే తడువు భూమిపొరల్లోని ఈ పురుగులు బయటకు వస్తాయి. ఆరుద్ర కార్తెలో కనిపిస్తుండటంతో ఆరుద్ర పురుగుగా రైతులు పిలుస్తుంటారు. ఈ పురుగు రాకను రైతులు శుభసూచకంగా భావిస్తుంటారు. వానపాముల్లా ఈ పురుగులు కూడా భూసారాన్ని పెంచుతాయి. శుక్రవారం నల్లగొండ జిల్లా నల్లగొండ మండలం కొత్తపల్లిలోని పొలాల్లో కనిపిస్తున్న ఆరుద్ర పురుగులు.

ఫొటో : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ



వినూత్నం.. మత్తు వదిలించడమే లక్ష్యం

- జనసమూహం వద్ద మత్తు పదార్థాల అనర్థాలపై ప్రచారం
- ప్రత్యేక అలంకరణతో ప్రజలను అవగాహన కల్పించే ప్రయత్నం

మత్తుకు బానిసలై జీవితాలను దెబ్బతీసుకుంటున్న వారి సంఖ్య ఇటీవల పెరిగింది. ఇలాంటి పరిస్థితుల్లో సమాజంలో మార్పు రావాలని మత్తుకు బానిసలు కావద్దని, వాటితో అనేక అనర్థాలు ఉన్నాయని తెలిపేందుకు ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ తనవంతు ప్రయత్నాలు చేస్తున్నాడు. ధూమపానికి బానిసై ఆరోగ్యం క్షీణించి మృతి చెందిన తన మిత్రుడిలా మరెవరూ కావద్దని వినూత్న రీతిలో ప్రచారం చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట(కలెక్టరేట్)

మత్తు పదార్థాల నిర్మూలనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అందుకోసం రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రత్యేక కార్యాచరణ ఏర్పాటుచేసి చర్యలు తీసుకుంటోంది. మత్తును అంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చింది. అయితే ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ మాత్రం ఒక అడుగు ముందుకేసి మత్తు పదార్థాల నిర్మూలనకు తనవంతుగా కృషి చేస్తున్నాడు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం తడకమళ్ల గ్రామానికి చెందిన ప్రభాకర్ ప్రస్తుతం సూర్యాపేటలో ఉంటున్నాడు. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరెంట్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఎవరో ఏదో అనుకుంటారని అనుకోకుండా తనద్వారా మత్తు పదార్థాలు వాడే వారిలో కొంతైనా మార్పు వస్తే చాలనుకున్నాడు.



మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలను వివరిస్తున్న ప్రభాకర్

కలచివేసిన మిత్రుడి మృతి

ఖమ్మంలో టీటీసీ కోర్సును అభ్యసించే సమయంలో తోటి మిత్రుడు ఒకరు ధూమపానానికి బానిసయ్యాడు. దాంతో ఆరోగ్యం చెడిపోతుందని చెప్పినా పట్టించుకోకపోవడంతో అనారోగ్యం బారిన పడి మృతి చెందాడు. మిత్రుడి మృతితో తీవ్రంగా కలత చెందిన ప్రభాకర్ తన మిత్రుడి మాదిరిగా సమాజంలో మత్తుతో మరెవరు మృతి చెందవద్దని భావించాడు. అందుకోసం తనవంతుగా కొందరిలోనైనా మార్పు వస్తుందని గ్రహించి తనవంతుగా వినూత్నంగా మత్తు పదార్థాలపై ప్రచారం చేస్తున్నారు.

నల్లని చొక్కా పుర్రెల దండ...

ప్రభాకర్ తన ప్రచారానికి వినూత్న మార్గాన్ని ఎంచుకున్నారు. చెప్పే విషయం అందరికీ తెలిసిందే కావడంతో విషయం పట్ల ఆకర్షణ కోసం వినూత్నంగా సిద్ధమవుతారు. నల్లని చొక్కా, దానిపై నో డ్రగ్స్ సేవ్ లైవ్ స్లోగన్, మెడలో పుర్రెలతో కూడిన దండ, చేతిలో మైక్, నెత్తిన టోపీ, కళ్ల జోడు పెట్టుకుని ప్రజలు గుమిగూడే ప్రదేశాలకు వెళ్తాడు. మత్తు పదార్థాలతో అనర్థాల గురించి ప్రజలకు వివరిస్తాడు. సొంతంగా కరపత్రాలను ముందింపజేసి వాటిని పంపిణీ చేస్తుంటారు. సూర్యాపేట పట్టణంతో పాటు సమీప మండలాల్లోని గ్రామాలు, ఇతర జిల్లాల్లో కూడా అవగాహన కల్పిస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి మత్తు పదర్థాల నిర్మూలనకు తనవంతుగా కృషి చేస్తున్నారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు



మత్తు పదార్థాల వినియోగం ఇటీవల పెరిగింది. పట్టణాలతో పాటు గ్రామాల్లోనూ గంజాయి విక్రయాలు జరుగుతున్నాయి. దీంతో విద్యార్థులు, యువత అలవాటు పడి విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలను ప్రజలకు వివరిస్తే కొందరిలోనైనా మార్పు వస్తుందనే నమ్మకం. కొన్ని నెలలుగా జిల్లాతో పాటు ఇతర జిల్లాల్లోనూ తీరిక సమయంలో అవగాహన కల్పిస్తున్నా.

రాచకొండ ప్రభాకర్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

రాష్ట్ర సైక్లింగ్ అకాడమీకి ఎంపికైన పరమసింహ



పరమసింహా

మర్రిగూడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్ సైక్లింగ్ అకాడమీ ఒలాద్రామ్‌కి నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలానికి చెందిన ఎడ్ల పరమసింహ ఎంపికయ్యారు. మండలంలోని దామెరభీమనపల్లికి గ్రామానికి చెందిన పరమసింహ మూడేళ్ల వయసులో ఉన్నప్పుడే తండ్రి అనారోగ్యంతో మృతి చెందాడు. తల్లి ఉన్నప్పటికీ మేనమామలైన జిల్లా కిషోర్, జిల్లా అశోక్‌ల సంరక్షణలో ఉంటూ చదువుకున్నాడు. హైదరాబాద్‌లోని విక్టోరియా మెమోరియల్ పాఠశా లలో ఇటీవలే 10వ తరగతి వరకు అక్కడే చదివి ఉత్తీర్ణుడయ్యాడు. సైక్లింగ్ అకాడమీ ఎంపికకు ఇటీవల నిర్వహించిన పోటీల్లో పరమసింహ ప్రతిభ కనబరిచి సీటు సాధించారు. అకాడమీలో ఐదేళ్ల పాటు శిక్షణ పొందనున్నారు. అకాడమీలో సీటు సాధించిందుకు సహకరించిన విక్టోరియ మెమోరియల్ పాఠశాల అధ్యాపక ప్రిన్సిపాల్ భాస్కర్, వైస్ ప్రిన్సిపాల్ రవి, పాఠశాల బృందానికి అతడి మేనమామలు కృతజ్ఞతలు తెలిపారు. పరమసింహను మండల ప్రజలు, నాయకులు అభినందించారు.

ఎమర్జెన్సీపై కాంగ్రెస్ నోరు విప్పాలి



ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన వారిని సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

భువనగిరి టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ 50 ఏళ్ల క్రితం ప్రధాని ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ తప్పని కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా ఒప్పుకోవాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, బీజేపీ దళిత మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్ అన్నారు. ఎమర్జెన్సీకి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రమైన భువనగిరిలో నిర్వహించిన బహిరంగా సభలో వారు మాట్లాడారు. ఎమర్జెన్సీ రూపకంలో ప్రజాస్వామ్యాన్ని నాయనమ్మ చేసిన హత్యను మనుమడు రాహుల్‌గాంధీ సమర్థిస్తే ధైర్యంగా ఎమర్జెన్సీ డే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎమర్జెన్సీలో కాంగ్రెస్ పార్టీ సాగించిన అరాచకాలపై నేటితరానికి బీజేపీ వివరిస్తుందన్నారు. దేశంలో గాంధీ కుటుంబం, రాష్ట్రంలో కల్వకుంట్ల కుటుంబం అవినీతికి పాల్పడి కుటుంబపాలన సాగించాయని ఆరోపించారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన వారిని ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు రత్నపురం బలరాం, ఎమర్జెన్సీ వ్యతిరేక కార్యక్రమ కన్వీనర్ పట్నం కపిల్ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



చింతలచెరువు తేజు

హాలియా, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : నిజామాబాద్ జిల్లాలో ఈ నెల 28 నుంచి జూలై 1వ తేదీ వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు నల్లగొండ జిల్లా హాలియా పట్టణానికి చెందిన విద్యార్థి చింతలచెరువు తేజు ఎంపికయ్యారు. ఈ నెల 22న నల్లగొండ జిల్లా కేంద్రంలోని మేకల అభినయ్ అవుట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారు. తేజను ఫుట్‌బాల్ అసోసియేషన్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు బండారు ప్రసాద్, ఉమ్మడి జిల్లా అసోసియేషన్ చైర్మన్ గట్ల అనంతరెడ్డి, జిల్లా అసోసియేషన్ కార్యదర్శి బొమ్మపాల గిరిబాబు, అసోసియేషన్ సభ్యులు గ్రామస్థులు అభినందించారు.

'పది' సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదల

నల్లగొండ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను శుక్రవారం విడుదలయ్యాయి. నల్లగొండ జిల్లాలో మొత్తం 617మందికి గాను 461మంది(74.72 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఇందులో 370మంది బాలురలో 261మంది (69.05శాతం) ఉత్తీర్ణత సాధించారు. బాలికల విభాగంలో 239మందికి గాను 200మంది (83.68శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

ప్రైవేట్ ఆసుపత్రులకు ఎందుకు పంపిస్తున్నారు?

మునుగోడు / చౌటుప్పల్ టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : చౌటుప్పల్ పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో రోగులపట్ల వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎందుకు ప్రైవేట్ ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. నల్లగొండ జిల్లా మునుగోడు మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ వైద్యఅధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. చౌటుప్పల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగులతో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఆసుపత్రికి వచ్చిన రోగులకు వైద్యం చేయకుండా ప్రైవేట్‌కు పంపుతున్న విషయం దృష్టికి రావటంతో వెంటనే డీసీహెచ్ఎస్ చిన్ననాయక్‌కు ఫోన్ చేసి సంబంధిత వైద్యుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగులను ఎందుకు రిఫర్ చేస్తున్నారని చిన్నానాయక్‌ను ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఇక నుంచి ప్రతీ నెల వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తానని, పనితీరులో మార్పు రావాలని తాను ఆశిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో యాదాద్రి భువనగిరి జిల్లా డీఎంహెచ్‌వో మనోహర్, నల్లగొండ, దేవరకొండ, చౌటుప్పల్ డిప్యూటి డీఎంహెచ్‌వోలు వేణుగోపాల్‌రెడ్డి, కళ్యాణ్‌చక్రవర్తి, యశోద, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.



వైద్యాధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

ప్రభుత్వ విద్య బలోపేతానికి ప్రణాళికలు

మునుగోడు నియోజకవర్గంలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలన్నదే లక్ష్యమని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం క్యాంప్ కార్యాలయంలో విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండలానికి ఐదు నుంచి ఆరు వరకు క్లస్టర్ స్కూళ్లను ఏర్పాటుచేసి అభివృద్ధి పరచాలన్నారు. ముందుగా మండలానికి ఒక పాఠశాలను పైలెట్ ప్రాజెక్ట్‌గా తీసుకొని అభివృద్ధి చేయాలన్నారు. ఇందుకు రూ.285కోట్లు అవసరమవుతాయని, ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో నల్లగొండ, యాదాద్రిభువనగిరి జిల్లాల డీఈవోలు బిక్షపతి, సత్యనారాయణ, వివిధ మండలాల ఎంఈవోలు పాల్గొన్నారు.

పునరావాస కల్పనకు నిర్వాసితుల మొర

మర్రిగూడ: తమకు పునరావాసం కల్పించాలని చర్లగూడెంరిజర్వాయర్ భూనిర్వాసితులు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మొర పెట్టుకున్నారు. మండలంలోని ఎరగండ్లపల్లి గ్రామంలో శుక్రవారం మార్నింగ్ వాక్ సందర్భంగా చర్లగూడెం ముంపు గ్రామ బాధితులు ఆయన కలిశారు. చర్లగూడెం రిజర్వాయర్‌లో వెంకపల్లి, వెంకేపల్లితండా, నర్సిరెడ్డిగూడెం, చర్లగూడెం గ్రామాలు పూర్తిగా ముంపుగురయ్యాయని కేవలం నర్సిరెడ్డిగూడెం గ్రామస్థులకు మాత్రమే పునరావాసం పట్టాలు పంపిణీ చేశారన్నారు. మిగిలిన గ్రామాల్లోని 1000 మందిని పునరావాసం కోసం డీఎల్ఎస్ ద్వారా అర్హులుగా గుర్తించినా పునారావాసం కల్పించలేదన్నారు. స్పందించిన ఎమ్మెల్యే బాధితుల కోరిక మేరకు ఇరిగేషన్ అధికారులతో ఫోన్ ద్వారా సమాచారం తెలుసుకున్నారు. మదనాపురం ప్రభుత్వ భూమిలోని పునరావాసం కల్పిస్తామని బాధితులకు పట్టా ధ్రువపత్రాలు పంపిణీ చేస్తామన్నారు.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	514.20 అడుగులు
టీఎంసీలు	138.9118
ఎడమకాల్వకు నీటి విడుదల	నిల్
కుడికాల్వకు	నిల్
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	450 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	450 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	24.41 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	641.50 అడుగులు
టీఎంసీలు	3.57
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	6.82క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	90.77క్యూసెక్కులు

ఆసక్తి చూపని టెండరుదారులు

యాదగిరిగుట్ట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానంలో శుక్రవారం పలు విభాగాలకు టెండర్లు నిర్వహించగా టెండరుదారులు నిరాసక్తత కనబర్చారు. మొత్తం 23 టెండర్లకు ఆరింటికి మాత్రమే ప్రధానకార్యాలయంలో టెండర్లు నిర్వహించారు. సత్యదేవుడి వ్రతాల వద్ద పూలు, పండ్లు విక్రయించే హక్కుకు ఆరు, కొండకింద పార్కింగ్ వద్ద బొమ్మల దుకాణం కోసం ఆరు, పట్టణంలో పాతబస్టాండ్ ఎదురుగా అద్దె గదుల కోసం రెండు, యోగానంద నిలయం దుకాణాలకు గాను రెండు, భూదాన్ పోచంపల్లి మండలం ఇంద్రియాల సుమారు 2 ఎకరాల వ్యవసాయ భూమి కౌలు రెండు, స్వామివారి ఫొటో ముద్రణ, సరఫరాకు సంబంధించి 2 టెండర్లు మాత్రమే వచ్చాయి. వీటిలో కొన్నింటికి ఎక్కువ, మరికొన్నింటికి తక్కువగా కోట్ చేయడంతో కమిషనర్ అనుమతి కోసం పంపనున్నట్లు డీఈవో దోర్బల భాస్కరశర్మ తెలిపారు. కాగా ఈ నెల 23న దేవస్థాన లీజెస్ విభాగానికి సంబంధించి టెండర్లను ఆహ్వానించారు.

కేవలం ఆరు లీజులకు మాత్రమే టెండరుదారులు ఆసక్తిచూపగా 17లీజుల కోసం ఎవరూ ముందుకు రాకపోవడం టెండరుదారుల మధ్య చర్చనీయాంశంగా మారింది. వివిధ పూజలకు దేవస్థానం అందించే సేవలు, వస్తు సామగ్రికి భక్తులు టెండరు ద్వారా దక్కిన దుకాణాల్లో విక్రయించే వస్తువులకు ఆదరణ చూపడం లేదని టెండరుదారులు వాపోయారు. టెండరు ప్రక్రియలో అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నరసింహమూర్తి, డీఈవో దోర్బల భాస్కరశర్మ, జిల్లా దేవాదాయ శాఖ పర్యవేక్షకురాలు వెంకటలక్ష్మీ, ఏఈవో గజవెల్లి రమేష్‌బాబు, బీ-5 విభాగం పర్యవేక్షకుడు యాస రాకేష్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- సూచిక బోర్డుల పరిశీలన

యాదగిరిగుట్ట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి దివ్యక్షేత్రంలో సూచిక బోర్డులను శుక్రవారం దేవాదాయ కమిషనర్, ఈవో ఎస్. వెంకట్రావు అధికారులతో కలిసి పరిశీలించారు. ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసేందుకు సూచిక బోర్డుల నమూనాను రూపొందించగా సంబంధిత స్థలంలో బిగించేందుకు చర్యలు తీసుకోవాలని ఈవో ఆదేశించారు. ఆయన వెంట డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవో గజ్వేల్లి రఘు, ఆలయ సివిల్ ఈఈ జిల్లెల దయాకర్‌రెడ్డి ఉన్నారు.



సూచిక బోర్డులను పరిశీలించి సూచనలు చేస్తున్న ఈవో వెంకట్రావు

నిత్యపూజా కైంకర్యాలు

ఉదయం 3.30 గంటలకు ఆలయాన్ని తెరుస్తారు
సుప్రభాతసేవ : ఉదయం 3.30-4 గంటల వరకు
ఆరాధన : 4-4.30వరకు, **బాలభోగం:**4.30-5.15వరకు
నిజాభిషేకం: 5.15-6.15, **పుష్పాలంకరణ సేవ:** 5.30-6.00
సహస్రనామార్చనలు: 6.15 నుంచి 7 గంటల వరకు
రాజభోగం: 11.45-12.30, మధ్యాహ్నం 3-4 గంటలవరకు ఆలయం మూసివేత
తిరువారాధన:సాయంత్రం 7-7.45, **సహస్రనామార్చన:**రాత్రి 7.30-8.15
ఆరగింపు: 9-9.45, **శయనోత్సవ దర్శనం:** 9.30- 9.45ద్వార బంధనం
ఉచిత దర్శనం:ఉదయం 6-7.30, 10-11.45 సాయంత్రం 5-7,రాత్రి 8.15-9
వీఐపీ దర్శనాల వేళలు: ఉదయం 9-10, సాయంత్రం 4-5వరకు

వైభవంగా మట్టపల్లివాసుడి కల్యాణం



కల్యాణతంతు నిర్వహిస్తున్న వేదపండితులు

మఠంపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని మట్టపల్లి దేవాలయంలో శ్రీలక్ష్మీనరసింహ స్వామి నిత్య శాశ్వత కల్యాణాన్ని శుక్రవారం అర్చకులు వేదమంత్రోచ్ఛరణాల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో నిత్యపూజలతో పాటు పంచామృతాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలు, అనంతరం కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు, ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్య ఇంజనీర్లను దేశానికి అందిస్తాం

- ఎంజీయూ ఉపకులపతి అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యాలు కలిగిన ఇంజనీర్లను దేశానికి అందించేలా కృషి చేస్తామని ఎంజీయూ ఉపకులపతి ఆచార్య అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్ర సమీపంలోని ఎంజీయూలో శుక్రవారం ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన వైజ్ఞానిక ఆవిష్కరణల ప్రదర్శనను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. నైపుణ్యాలు కలిగిన మానవవనరుల ఉత్పత్తి లక్ష్యంగా స్థాపించిన ఎంజీ యూనివర్సిటీ లక్ష్యం దిశగా పయనానికి నేటి వైజ్ఞానిక ప్రదర్శన నిదర్శనమన్నారు. విద్యార్థులు తమ అధ్యాపకుల ప్రోత్సాహంతో చేసిన ఆవిష్కరణలు వారి సున్నితత్వానికి, సామాజిక స్పృహకు నిదర్శనమన్నారు. విశ్వ విద్యాలయ రూ.3.5లక్షల ఆర్థిక సహకారంతో ఎనిమిది మంది విద్యార్థుల సామర్థ్యం కలిగిన సోలార్ క్యాంపస్ కారును రూపొందించడం హర్షించదగ్గ విషయమన్నారు. నాలుగు గంటలు పూర్తి చార్జింగ్‌తో 90 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చన్నారు. అధునాత వాహనాల్లో ఉండే సౌకర్యాలను కల్పించడంలో విద్యార్థులు పడిన తపన స్పష్టంగా కనిపిస్తోందన్నారు. క్యాంపస్ కారుతో పాటు ఆటోమెటిక్ ఫ్లోర్‌క్లీనర్, వాయిస్ కంట్రోల్ స్మార్ట్ డస్ట్‌బిన్, ఫొటోగ్రఫిక్ క్లాక్, వీసీఆర్ బేస్డ్ రిఫ్రజేటర్, ఎమర్జెన్సీ అలర్ట్‌సిస్టమ్, ఆటోమెటిక్ కూలర్ కంట్రోల్ సిస్టమ్, ఎలక్ట్రిక్ స్కూటర్, సోలార్ గ్రాస్ కట్టర్, అంబులెన్స్ డ్రైవర్స్ ఉపయోగించే సిగ్నలింగ్, ఎలక్ట్రిక్ స్కూటర్ వంటి ప్రాజెక్టులను రూపకల్పన చేశారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్.సుధారాణి, ఇన్‌స్ట్రక్టర్ డ్రైవర్ ఆకుల రవి, డీన్ ఆచార్య రేఖ, మౌనిక, అవినాష్ జయంతి, నాగరాజు, మానేశ్వర్‌రావు, జ్యోతిరాణి, శ్రీనివాస్‌తో పాటు విద్యార్థులు, తదితరులు ఉన్నారు.



వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న వీసీ అల్తాఫ్‌హుస్సేన్

విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి

వలిగొండ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రొద్దుటూరు, ఏదుల్లాగూడెం గ్రామ విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని ఎంఈవో భాస్కర్ శుక్రవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ హనుమంతరావుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తుర్కపల్లి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల2000-01 ఎస్ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఓ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఒకరికొకరు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్య నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు భూక్య రవీందర్‌నాయక్, మంతపురి నరేశ్, రేఖా, పోశయ్య, మధు, శంకర్, బాలకృష్ణ, కృష్ణ, చంద్రమౌళి ఉన్నారు.

వైభవంగా ఊంజల్ సేవోత్సవం



లక్ష్మీఅమ్మవారికి ఊంజల్ సేవోత్సం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి వారి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయ రీతిలో కొనసాగాయి. ప్రధాన ఆలయానికి అనుబంధ శివాలయంలో ‘చండీహోమం నిర్వహించారు. కాగా ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ. 15,54,417 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు.

మహిళలపై దాడులను అరికట్టాలి: అనురాధ



ఐద్వా సభ్యత్వాలు అందజేస్తున్న జిల్లా కార్యదర్శి అనురాధ

భువనగిరి గంజ్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : మహిళలు, చిన్నారులపై దాడులు, దౌర్జన్యాలను అరికట్టాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టుపల్లి అనురాధ డిమాండ్‌చేశారు. జిల్లా కేంద్రంలోని శుక్రవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ చదువుకున్న మహిళలకు ఉపాధి కల్పించాలని కోరారు. మద్యం, మత్తు పదార్థాల కారణంగా యువత పెడదారి పడుతోందని అన్నారు. మహిళలు, చిన్నారుల రక్షణ చట్టాలను అమలు చేయాలన్నారు. మహిళలపై దాడులకు పాల్పడేవారిని శిక్షించాలన్నారు. కార్యక్రమంలో మాయ రాణి, బాలమణి, లావణ్య, విజయ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ప్రారంభించాలి: డీవైఎఫ్ఐ

భువనగిరి గంజ్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను వెంటనే ప్రారంభించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం భువనగిరి ఇంటిగ్రేటెడ్ సమీకృత మార్కెట్‌ను సంఘం ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ స్థానిక వ్యాపారుల కోసం గత ప్రభుత్వం నిర్మించిందని, ఎన్నికల అనంతరం కొత్త ప్రభుత్వం దానిని పట్టించుకోలేదని అన్నారు. తక్షణమే మార్కెట్ ప్రారంభించకపోతే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ సహాయ కార్యదర్శి ఎండీ.సలీం, షేక్ రియాజ్, నరేష్, ఎండీ సాజిద్, ఎండిసోహెల్, సయ్యద్ అమన్ పాల్గొన్నారు.

నీటి నిల్వలను తొలగించుకోవాలి: ఎంపీడీవో

భువనగిరి రూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం దృష్ట్యా నీటి తొట్లు, సంపుల్లో నీటి నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని ఎంపీడీవో సీహెచ్.శ్రీనివాస్ అన్నారు. ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని అనంతారం గ్రామంలో ఆయన పర్యటించి నీటి నిల్వలు నెలకొని ఉన్న ప్రాంతాల్లో, మురికి కాల్వలో పేరుకుపోయిన మురికి నీటితో పాటు ఇళ్ల పరిసర ప్రాంతాల్లో సంపులు, నీటి తొట్లు తదితర ప్రాంతాల్లో పేరుకుపోయిన ప్రాంతాల్లో శుభ్రం చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్సింగ్‌రావు, ఏఎన్ఎం, ఆశా, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి ఆర్థిక చేయూత

భువనగిరి రూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న రైతు కుటుంబాలకు అండగా ఉండి ఆదుకుంటానని చందపట్ల పీఏసీఎస్ చైర్మన్ మందడి లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మండలంలోని చందుపట్లకు చెందిన రైతు పిట్టల సంజీవ (55) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 30వేల నగదు ఆర్థిక సాయం అందచేశారు. పీఏసీఎస్ డైరెక్టర్లు బల్గూరి మధుసూదన్ రెడ్డి, మహేందర్, బ్యాంకు సీఈవో నల్లమాస రాములు, నాగరాజు పాల్గొన్నారు. .

కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి: పీఎన్ఎం

భూదాన్‌పోచంపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : జానపద వృత్తి కళాకారులైన చిందు, యక్షగాన, కోలాటం, భాగోతం భజన కళాకారులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం భూదాన్‌పోచంపల్లిలో పీఎన్ఎం మండల మొదటి మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్యాలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కళాకారులకు ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని కోరారు. కళాకారులకు నెలకు రూ. 5వేల పింఛను, ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. మహాసభలో సీఐటీయూ మండల కన్వీనర్ మంచాల మధు, బుగ్గ లక్ష్మయ్య పాల్గొన్నారు. మహాసభ అనంతరం పీఎన్ఎం మండల కన్వీనర్‌గా గడ్డం పాండురంగం, కో-కన్వీనర్‌గా చుక్క రజినీకాంత్, కోట రమేష్‌ను ఎంపిక చేశారు.

ఎమ్మెల్యేను విమర్శించడం తగదు

రాజాపేట, జూన్27 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను బీఆర్ఎస్ నాయకులు విమర్శించడం తగదని కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు ఇంజ నరేష్, మోత్కుపల్లి ప్రవీన్‌లు అన్నారు. శుక్రవారం రాజాపేట మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. మలుపవాని చెరువులో దళితులు భూములను బాగు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి జరుగుతుందని అన్నారు. ఎమ్మెల్యే ఆలేరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని, గందమల్ల రిజర్వాయర్‌కు నిధులు మంజూరు చేయించి శంకుస్థాపన చేశారని తెలిపారు. సమావేశంలో నాయకులు గొల్లపల్లి రాంరెడ్డి, నాగిర్తి రాజిరెడ్డి, అంకతి బాలయ్య,రాపోల్ లక్ష్మారెడ్డి, శీతాల వీరయ్య, బాలరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు పబ్బు రాజుగౌడ్

చౌటుప్పల్ టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి- సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కాంగ్రెస్ మునుగోడు అసెంబ్లీ కో-ఆర్డినేటర్ పబ్బు రాజుగౌడ్ కోరారు. చౌటుప్పల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం యువజన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాజు గౌడ్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రైతు భరోసా, రైతు రుణమాఫీ, ఇళ్లకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం తదితర సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందని ఆయన అన్నారు. సమావేశంలో ఏఎంసీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనా రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాచకొండ భార్గవ్ పాల్గొన్నారు.

హమాలీ కార్మికుడి వైద్య ఖర్చులు ప్రభుత్వం భరించాలి

వలిగొండ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గోదాంలో పనిచేస్తుండగా ప్రమాదానికి గురైన మొగిలిపాక కిష్టయ్య వైద్య ఖర్చులు ప్రభుత్వం భరించాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నల్ల నరేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులోని గోదాముల ముందు క్షతగాత్రుడు కిష్టయ్య కుటుంబసభ్యులతో కలిసి ధర్మసమాజ్ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, హమాలీ కార్మికుడు మొగిలిపాక కిష్టయ్య 15సంవత్సరాలుగా వ్యవసాయ మార్కెట్‌లో హమాలీగా పనిచేస్తున్నాడని అన్నారు. ఆ పని ప్రదేశంలో భద్రత లోపం కారణంగా లారీ పైనుండి గొనెసంచులు దింపుతుండగా కింద పడి తలకు బలమైన గాయాలు అయి ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికత్స పొందుతున్నాడని అన్నారు. అతని వైద్యానికి సుమారు రూ.6,50,000 ఖర్చు అయిందని మార్కెట్ కమిటీ పాలకవర్గం కానీ, సివిల్ సప్లయ్, మార్కెటింగ్ అధికారులుగానీ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

త్వరలో అందుబాటులోకి టౌన్‌హాల్



కొద్ది రోజుల్లో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న టౌన్‌హాల్ భవనం

- తుది దశకు భవన నిర్మాణ పనులు
- టాయిలెట్ బ్లాక్ నిర్మాణంలో కొంత జాప్యం

చౌటుప్పల్ టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ పట్టణంలోని 13వ వార్డులో శ్యామ్ ప్రసాద్‌ముఖర్జీ రూర్బన్ పథకం కింద ఒక కోటి రూపాయలతో చేపట్టిన టౌన్ హాల్ భవన నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ టౌన్ హాల్ భవన నిర్మాణ పనులను చేపట్టాయి. మరో నెల రోజుల్లో పనులను పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో అధికారులు పనిచేస్తున్నారు. చౌటుప్పల్ మునిసిపాలిటీగా మారి నందున కేంద్ర ప్రభుత్వం ప్రజల ప్రయోజనార్థం టౌన్‌హాల్‌ను నిర్మించేందుకు 1.50కోట్లను మంజూరు చేసింది. 13వ వార్డులో గల పార్క్ స్థలంలో సుమారు రూ.85లక్షలను వెచ్చించి టౌన్‌హాల్ భవనాన్ని సుందరంగా నిర్మించారు. భవనం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో రూ.15లక్షలను వెచ్చించి టాయిలెట్ బ్లాక్‌ను నిర్మించేందుకు అధికారులు ప్లాన్ సిద్ధం చేశారు. సమీపంలోని కొంత మంది వ్యక్తుల అభ్యంతరాలతో టాయిలెట్ బ్లాక్ నిర్మాణ పనుల్లో కొంత జాప్యం జరిగింది. ఈ సమస్యను మునిసిపల్ కమిషనర్ కోమటిరెడ్డి నర్సింహారెడ్డి చొరవ తీసుకుని పరిష్కరించారు. దీంతో వారం, పది రోజుల్లో టాయిలెట్ బ్లాక్ నిర్మాణ పనులను మొదలు పెట్టేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. టాయిలెట్ బ్లాక్ నిర్మాణంలో చోటు చేసుకున్న జాప్యంతో టౌన్‌హాల్ ఆవరణ గడ్డి, పిచ్చి మొక్కలతో నిండి పోయింది. నిర్మాణం పూర్తి చేసుకున్న టౌన్ హాల్ భవనం కూడ దుమ్ము, దూళితో నిండి పోతోంది.

ప్రజలకు అందుబాటులోకి తేవాలి



టౌన్ హాల్ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలి. అభివృద్ధి పనులను పూర్తి చేయించేందుకు స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపించాలి. పట్టణంలో టౌన్ హాల్ లేక పోవడంతో స్థానికులు సమావేశాలను నిర్వహించుకునేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. తప్పని పరిస్థితుల్లో పెద్ద మొత్తాలను వెచ్చించి ఫంక్షన్ హాల్స్‌ను అద్దెకు తీసుకుంటున్నారు.

-దూడల బిక్షం గౌడ్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్

త్వరలోనే టాయిలెట్ బ్లాక్ నిర్మాణ పనులు

టాయిలెట్ బ్లాక్ నిర్మాణ పనులను త్వరలోనే మొదలు పెట్టేందుకు ప్లాన్ చేస్తున్నాం. కొందరి అభ్యంతరాలతో టాయిలెట్ బ్లాక్ నిర్మాణ పనులలో కొంత జాప్యం జరిగింది. ఈ సమస్యను మునిసిపల్ కమిషనర్ కె.నర్సింహారెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా పరిష్కారం జరిగింది. త్వరితగతిన టాయిలెట్ బ్లాక్ నిర్మాణ పనులను పూర్తి చేయించి, ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తాం.

-నితీష్‌రెడ్డి, పీఆర్ ఏఈ, చౌటుప్పల్

మట్టి మాఫియాపై కేసులు నమోదు చేయాలి



మలుపవాని చెరువులో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు

రాజాపేట, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మట్టి మాఫియాపై కేసులు నమోదు చేయాలని డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి డిమాండ్‌చేశారు. ఈమేరకు శుక్రవారం రాజాపేట మండలం చల్లూరు మలుపవాని చెరువులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆలేరు ఎమ్మెల్యే, కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మట్టి తరలించిన గుంతలను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, తహసీల్దార్ అనితకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఆలేరులో భూకబ్జాలతో పాటు మట్టి దందాలు జరుగుతున్నాయని ఆరోపించారు. గత ప్రభుత్వం చెరువులను కాపాడితే కాంగ్రెస్ నాయకులు చెరువులను చెరబట్టి దోచుకుంటున్నారన్నారు. మట్టి తరలింపునకు పాల్పడ్డ వారిపై కేసులు నమోదు చేసి, వినియోగించిన యంత్రాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సట్టు తిరమలేష్, కర్రె వెంకటయ్య, గడ్డమీది రవీందర్, బింగి రమేష్, బాబు, పల్లె సంతోష్, ఎర్రగోకుల జశ్వంత్, గోపగాని బాలమణి యాదగిరిగౌడ్, గుంటి మధుసూదన్ రెడ్డి, నాగిర్తి గోపాల్‌రెడ్డి, బొంగొని ఉప్పలయ్య, రామిండ్ల నరేందర్, మేక వెంకటేశ్వర్ రెడ్డి, గుంటి కృష్ణ, బూరుగు నర్సిరెడ్డి, మాటూరి రాజు, బండపల్లి రఘు, ఇప్ప వెంకన్న, ఎడ్ల రామచంద్రారెడ్డి తదతరులు పాల్గొన్నారు.

మట్టి తరలించేవారిపై కేసులు నమోదు చేస్తున్నాం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణారెడ్డి

రాజాపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు మల్లవాని చెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలించిన వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం రాజాపేట మండల తహసీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఆరు రోజులుగా ఎలాంటి అనుమతులు లేకుండా టిప్పర్ల ద్వారా అక్రమంగా మట్టిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని, ఈనెల 24న పోలీసులకు సమాచారం అందిందన్నారు. రాజాపేట పోలీసులు చెరువు వద్ద 23 టిప్పర్లను పట్టుకుని స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఐబీ, మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు కలసి మట్టి తరలింపునకు పాల్పడ్డ వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో యాదగిరిగుట్ట సీఐ శంకర్‌గౌడ్, తహసీల్దార్ అనిత, ఎస్ఐ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● భూభారతి దరఖాస్తుల ప్రక్రియ వేగంగా జరుగుతోందని ఆర్డీవో కృష్ణారెడ్డి అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. ఆగస్టు 15 వరకు సమస్యలను పరిష్కరిస్తామన్నారు. 150 మంది సర్వేయర్లుగా శిక్షణ పొందుతున్నారని తెలిపారు.

చెరువు స్థలంలో అక్రమ కట్టడాలను నిలిపివేయాలి

ఆత్మకూరు(ఎం) జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో చెరువు స్థలంలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను తక్షణమే నిలిపివేయాలని బీజేపీ నాయకులు కోరారు. ఈమేరకు శుక్రవారం అదనపు కలెక్టర్ భాస్కర్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. బీజేపీ నాయకులు జి.కాశీనాథ్, బొట్టు అబ్బయ్య, బొబ్బల ఇంద్రారెడ్డి, బి.సత్యనారాయణ, ఎం.సాగర్ పాల్గొన్నారు.

అభివృద్ధిని పరుగులు పెట్టిస్తాం: ఎమ్మెల్యే



బీబీనగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

బీబీనగర్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బీబీనగర్ మండలంలో హెచ్ఎండీఏ నిధులు రూ.16.8కోట్ల నిధులతో చేపట్టబోతున్న పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోపే హెచ్ఎండీఏ నుంచి ఎప్పుడు లేని విధంగా నియోజకవర్గ అభివృద్ధిని అత్యధికంగా రూ. 56కోట్ల నిధులను మంజూరు చేయించినట్లు తెలిపారు. ఇందులో బీబీనగర్ మండలానికి రూ.16.8కోట్లను కేటాయించగా బీబీనగర్ పట్టణంలో రూ. 3.20కోట్లతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టబోతున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని తాగు నీటి కాల్వలు, బునాదిగాని, పిలాయిపల్లి కాల్వల విస్తరణకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కోరిన వెంటనే రూ. 500కోట్ల నిధులను మంజూరు చేశారని, కాల్వల విస్తరణ పనులు కూడా మొదలయ్యాయని తెలిపారు. చిన్న నీటి కాల్వలు బొల్లేపల్లి, అల్లినగర్, బీమలింగం కాల్వల విస్తరణ పనులు కూడా చేపట్టనున్నామన్నారు. బీబీనగర్ పట్టణంలోని పెద్దచెరువును మినీ ట్యాంకు బండ్‌గా అభివృద్ధి పరిచి పర్యాటక ప్రదేశంగా తీర్చి దిద్దనున్నామని తెలిపారు. బీబీనగర్ మండలానికి 717 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో నాయకులు పంజాల రామాంజనేయులుగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ గడ్డం బాలకృష్ణ గౌడ్, పి శ్యాంగౌడ్, మండల అధ్యక్షుడు సురకంటి సత్తిరెడ్డి, గోలి నరేందర్ రెడ్డి, పంజాల పెంటయ్య గౌడ్, గడ్డం బాల్ రెడ్డి, లక్ష్మయ్య, బస్వయ్య , వెంకటేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

● మత సామరస్యానికి ప్రతీక మొహర్రం అని ఎమ్మెల్యే అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. మొహర్రం వేడుకలు మొదలైన సందర్భంగా మండలంలోని కొండమడుగు గ్రామంలోని అషూర్ ఖాన, షాజగా ఈకాసీంను సందర్శించి పీర్లకు నూతన దట్టీలను సమర్పించి ఫాతేహా ఇచ్చారు. కార్యక్రమంలో సయ్యద్ హైదర్ ఉస్సేన్, జాఫరి, ముతావలి, సయ్యద్ అలీ జాఫరి, కాసీం జాఫరి, తాజామాజీ సర్పంచ్ కడెం లత రాజేశ్ బాబు, మాజీ జడ్పీటీసీ పెంటయ్య, నాయకులు అంజనేయులు గౌడ్, జంగయ్య గౌడ్, హనుమంతరావు, శ్రీనివాస్ గౌడ్, వెంకటేశ్, శ్రీధర్, మాధవరెడ్డి, మహేశ్ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

మోత్కూరు, భూదాన్‌పోచంపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జూలై 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేషం కోరారు. శుక్రవారం మోత్కూరు ఎంపీడీవో, మునిసిపల్ కార్యాలయాల్లో ఆయన స్థానిక నాయకులతో కలిసి సమ్మె నోటీలు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌కె శ్రీను పాల్గొన్నారు. భూదాన్‌పోచంపల్లిలో నిర్వహించిన సమామేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు మాట్లాడారు. కార్మికుల హక్కులను ప్రభుత్వాలు పరిరక్షించాలన్నారు.

వీధికుక్కల బారినుంచి గొర్రెలు, మేకలను కాపాడాలి

గుండాల, జూన్27(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వీధి కుక్కల బారినుంచి గొర్రెలు, మేకలను ప్రభుత్వమే కాపాడాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దయ్యాల నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన గొర్రెల మేకల పెంపకందారుల సంఘం సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి మద్దెపురం రాజు, నాయకులు మల్లయ్య, బుగ్గరాములు, గోపాల్, మల్లేశ్, సత్తయ్య, దేవేందర్ పాల్గొన్నారు.

ప్రారంభమైన మొహర్రం

భువనగిరి టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మొహర్రం పండుగ శుక్రవారం ప్రారంభమైంది. జిల్లా అంతటా అశుర్ఖానాల్లో పీర్లను ప్రతిష్ఠించారు. జిల్లా కేంద్రం భువనగిరి పట్టణంలో జిల్లా షియా ముస్లింల సంఘం ఆధ్వర్యంలో పీర్ల చావిడీల్లో సంస్మరణ గీతాలు ఆలపించారు జిల్లాలో పీర్ల పండుగ సందడి నెలకొంది. దట్టీలు, పువ్వులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు భువనగిరిలో జగన్నాథ రథయాత్ర

భువనగిరి టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జగన్నాథస్వామి రథయాత్ర శనివారం భువనగిరిలో నిర్వహించనున్నారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో సాగే రథయాత్ర సాయంత్రం మూడు గంటలకు హైదరాబాద్ చౌరస్తా వద్ద ప్రారంభమైన రైల్వే స్టేషన్ వరకు సాగుతుంది. భజనలు, కోలాటాలు, భక్తి గీతాలాపనలతో సాగే రథయాత్రలో భక్తులు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

వన మహోత్సవం షురూ..!

(5వ పేజీ తరువాయి)

2.60లక్షల వరకు మొక్కలను పెంచుతున్నారు. వనమహోత్సవంలో ప్రధానంగా నీడనిచ్చే చెట్లతోపాటు పండ్లు, పూల మొక్కలను పెంచేందుకు జిల్లా యంత్రాంగం తగిన ప్రణాళికను రూపొందించింది. నర్సరీల్లోనూ ఈ మొక్కలను పెంచేందుకు ప్రాధాన్యమిచ్చింది. టేకు, కానుగ, నేరేడు, ఈత, ఉసిరి, దానిమ్మ, నిమ్మ, జామ, బొప్పాయి, సీతాఫల్ పండ్ల మొక్కలను, చెరువు కట్టలపై ఈత, కర్జూర, తుమ్మచెట్లను నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అదేవిధంగా ఇళ్లలో పెంచుకునేందుకు పలు రకాల పూల మొక్కలను కూడా పంపిణీ చేయనున్నారు. వీటిలో గులాబీ, గన్నేరు, చామంతి, మల్లెపూలు, తదితర మొక్కలను పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ప్రదేశాలతో పాటు ప్రభుత్వ భూములు, కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో, రోడ్డుకు ఇరువైపులా, ప్రతీ ఇంటి వద్ద మొక్కలు నాటేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అన్నిశాఖల అధికారులు భాగస్వాములై మొక్కలను నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

మొక్కలు నాటడం ప్రారంభించాం

వనమహోత్సవం కింద అన్ని శాఖలు మొక్కలు నాటేందుకు జిల్లా యంత్రాంగం తగిన కార్యాచరణ రూపొందించింది. మొక్కల పెంపకానికి ప్రతీ గ్రామానికి నర్సరీని ఏర్పాటుచేశాం. జిల్లాలో గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మొత్తం 418 నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నాం. వీటితోపాటు ఆటవీ శాఖ 18, మునిసిపల్ శాఖ 15నర్సరీలు ఏర్పాటు చేసింది. 2025లో ప్రభుత్వం నిర్దేశించిన 20. 90 లక్షల మేరకు నాటాల్సిన మొక్కలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వనమహోత్సవంలో జిల్లాకు అవసరమైన మొక్కలను పెంచుతున్నాం. నర్సరీల్లో మొక్కలు పెంచాం. మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. వర్షాలు పలు ప్రాంతాల్లో కురుస్తుండటంతో మొక్కలు నాటడం ప్రారంభించాం.

-టి.నాగిరెడ్డి, డీఆర్డీవో

రూ.28 కోట్లతో భువనగిరికి మహర్దశ:కాంగ్రెస్

భువనగిరి టౌన్: ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి కృషితో మంజూరైన రూ.28.60 కోట్ల హెచ్ఎండీఏ నిధులతో పట్టణానికి మహర్దశ రానున్నదని కాంగ్రెస్ నేత పోత్నక్ ప్రమోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం భువనగిరిలో ఆయన మాట్లాడారు.

మునిసిపల్ కమిషనర్‌గా లింగస్వామి



యాదగిరిగుట్ట రూరల్, జూన్ 27, (అంధ్యజ్యోతి): యాదగిరిగుట్ట మునిసిపల్ కమిషనర్‌గా మిర్యాల లింగస్వామి శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు విధులు నిర్వహించిన అజయ్‌కుమార్‌రెడ్డి బదిలీపై తెల్లాపూర్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో సెక్రటేరియట్ నుంచి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో వార్డుల వారీగా సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తానని అన్నారు. అనంతం 11వ వార్డులోని పారిశుధ్య పనులను పరిశీలించారు. మునిసిపల్ మేనేజర్ శారద, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.సురేందర్‌గౌడ్, ఇన్‌చార్జి ఎస్ఐ దండు కిరణ్‌బాబు, వార్డు ఆఫీసర్లు, సిబ్బంది ఉన్నారు.

ఏజీపీగా భీమగాని హరిబాబు



భువనగిరి (కలెక్టరేట్), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): భువనగిరి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా భీమగాని హరిబాబు నియామకమయ్యారు. శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మర్యాదపూర్వకంగా కలెక్టర్ హనుమంతరావును కలిశారు. తన నియామకానికి సహకరించిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు ఈ సందర్భంగా హరిబాబు కృతజ్ఞతలు తెలిపారు.

పాల సంఘాల చైర్మన్ల ఎన్నిక

మోత్కూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు మండలం ముశిపట్ల పాల ఉత్పత్తిదారుల మహిళా సంఘం పాలక వర్గానికి శుక్రవారం నిర్వహించిన ఎన్నికల్లో చైర్‌పర్సన్‌గా కాంగ్రెస్‌కు చెందిన తండ అనసూయ, ఎన్నికయ్యారు. పాలడుగు శ్రీరామ పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్‌గా కాంగ్రెస్‌కు చెందిన మిడిదొడ్డి పురుషోత్తం, పనకబండలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన లోతుకుంట లచ్చయ్య, ముశిపట్లలో అనసూయ, పాలడుగులో ముక్కర్ల మహేష్ ఎన్నికయ్యారు.

సంస్థాన్ నారాయణపురం: సంస్థాన్ నారాయణపురం మండలం జనగాం పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షుడిగా మంచాల జంగయ్య నాలుగవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా కొండూరి ముత్యాలు, కొండూరి యాదగిరి, బైకని ఐలయ్య, బెల్లంకొండ నర్సింహ, వేమిరెడ్డి రామిరెడ్డి, కొండూరు చంద్రమ్మ, మంచాల నర్సింహ, బొద్రబోయిన శ్రీను, బొద్రబోయిన ఎల్లయ్య, ఎన్నికయ్యారు .

సీతారంపురం పాల సంఘం చైర్మన్‌గా సోమిరెడ్డి



గుండాల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారాంపురం గ్రామంలో పాల సంఘం చైర్మన్‌గా మల్‌పెద్ది సోమిరెడ్డిని శుక్రవారం డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 8మంది డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా నూతన డైరెక్టర్లుగా కాలి వెంకన్న, శ్రీశైలంలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో అబ్బయ్య, డైరెక్టర్లు బీంరెడ్డి, మచ్చ మల్లారెడ్డి, రాం దయాకర్ రెడ్డి పాల్గొన్నారు.

సీపీఐ మండల కార్యదర్శిగా నర్సింహా



రామన్నపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సీపీఐ మండల కార్యదర్శిగా రామన్నపేట పట్టణానికి చెందిన ఉట్కూరి నర్సింహ ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శిగా కళ్లెం రాంచందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

టీజేయూ మండల అధ్యక్షుడిగా సిద్దులు

ఆలేరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జర్నలిస్టు యూనియన్ ఆలేరు మండల అధ్యక్షుడిగా కూళ్ల సిద్దులు నియమితులయ్యారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు షానూర్ బాబా ఆయనకు నియామక పత్రం అందజేశారు. జర్నలిస్టు సమస్యలపై స్పందించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా అధ్యక్షుడు ఈసందర్భంగా కోరారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

మోత్కూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సింగిల్ విండోలో రైతులు, చిరువ్యాపారులు తీసుకున్న రుణాలను సకాలంలో చెలించేలా డైరెక్టర్లు, సంఘం సిబ్బంది కృషి చేయాలని సింగిల్ విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం సాయంత్రం జరిగిన పాలక వర్గ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. సమావేశంలో డైరెక్టర్లు డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, పురుగుల మల్లయ్య, కారుపోతుల ముత్తయ్య, సామ పద్మారెడ్డి పాల్గొన్నారు.

లాభాల బాటలో సింగిల్ విండో

ఆలేరు, జూన్27(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు అందిస్తున్న సహకారంతో ఆలేరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నేడు లాభాల బాటలో పయనిస్తుందని ఆ సంఘం చైర్మన్ మొగులగాని మల్లేశం చెప్పారు. శుక్రవారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన మహాజన సభలో ఆయన రైతులనుద్దేశించి మాట్లాడారు. తాము బాధ్యతలు చేపట్టినప్పుడు సంఘం ఆదాయం రూ.98వేలు మాత్రమే ఉండగా తమ ఐదేళ్ల పాలనలో రూ.కోటి 15లక్షలకు చేరిందన్నారు.